పేదలకు ఇండ్ల స్థలాలు అందించండి..

కందుకూరు, నవంబర్ 13 : పేదలకు ఇంటి స్థలాలు అందించాలని సీఐటీయూ మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ అధికారులను కోరారు. బుధవారం ఆయన సీపీఎం సీనియర్ నాయకుడు జంగారెడ్డి, పేదలతో కలిసి ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం బాల్‌రాజ్ మాట్లాడుతూ.. పేదలకు ఇంటి సర్టిఫికెట్లను ఇచ్చి స్థలం చూపలేదని, దీంతో వారికి నివాసం లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. 788 , 107 సర్వే నంబర్లలో 183 మందికి పట్టాలు ఇచ్చిన అధికారులు ఆ భూముల్లో గుడిసెలు వేసుకుంటే పోలీసులు తొలగించారని వివరించారు. పేదలకు ఇండ్ల సర్టిఫికెట్లు ఇచ్చి ఎండ్లు గడుస్తున్నా పట్టించుకోవడంలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఇంటి స్థలాలను చూపించి ఆదుకోవాలని కోరారు. సమస్యను ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని ఆర్డీఓ హామీఇచ్చినట్లు బాల్‌రాజ్ పేర్కొన్నా రు. ఆయన వెంట పిల్లి రవి, మహేందర్, ఆరుణ, చంచల. జ్యోతి, సబియా బేగం, సక్కుబాయి, మంగ, శ్రీను ఉన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించండి..

ఉప్పల్, నవంబర్ 13: చిలుకానగర్ డివిజన్‌లో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ కోరారు. ఈ మేరకు ఎల్బీనగర్‌జోన్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్‌లోని బీరప్పగడ్డ, న్యూరామ్‌నగర్, కుమ్మరికుంట, బొడ్రాయి ప్రాంతంలో వరదనీటి సమస్యలు, సీసీ రోడ్ల సమస్యలున్నాయని తెలిపారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ పాల్గొన్నారు.

అధికారుల కనుసన్నల్లో అడ్డగోలు పనులు!

- బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో టెండర్లు వేయకుండానే అభివృద్ధి పనులు చేపడుతున్న అధికారులు
- సిమెంట్ బదులు డస్టుతో సీసీ రోడ్లు వేయిస్తున్న కాంట్రాక్టర్లు
- అధికారులు, కాంట్రాక్టర్ల తీరుపై సర్వత్రా విమర్శలు

బడంగ్‌పేట, నవంబర్ 13 : బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అధికారులు నిబంధనలకు తిలోదకాలు వదిలారన్న ఆరోపణలు సర్వత్రా వెల్లువెత్తుతున్నాయి. అత్యవసరం అయితే తప్ప టెండర్ వేయకుండా అభివృద్ధి పనులు చేయకూడదన్న నిబంధనలున్నప్పటికీ అడ్డగోలుగా పనులు చేపడుతున్నారని కొందరు కార్పొరేటర్లు ఆరోపిస్తున్నారు. తమకు తెలియకుండానే అభివృద్ధి పనులు చేస్తున్నారని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చేసిన పనుల్లో సైతం నాణ్యత ప్రమాణాలు పాటించడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. డస్టుపైన ఇసుక చల్లి పూర్తిగా డస్టుతోనే సీసీ రోడ్లు వేస్తున్నారని మండి పడుతున్నారు. పనులకు సంబంధించి సోషల్ మీడియాలో వీడియోలు వైరల్ అవుతున్నా అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. కాంట్రాక్టర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు అంతా ఒక్కటై అడ్డగోలు పనులు చేయిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

చేసిన పనులకు టెండర్లు?

బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వివిధ డివిజన్లలో అభివృద్ధి పనులు చేసిన తర్వాత టెండర్ వేస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. పనులు జరిగిన విషయం టెండర్‌లో పాల్గొన్న వ్యక్తికి తెలియదు.. టెండర్ వచ్చిన తర్వాత పరిశీలిస్తే అప్పటికే పనులు అయిపోయినట్లు తెలిసి ముక్కున వేలేసుకుంటున్నారు. టెండర్ వచ్చిన వ్యక్తిని టెండర్ లేకుండా చేసిన ఇద్దరు కాంట్రాక్టర్లను పిలిపించి అధికారులు, ప్రజాప్రతినిధులు రాజీ కుదుర్చే పనిలో పడినట్లు సమాచారం. దీంతో కాంట్రాక్టర్ల మధ్య విభేదాలు భగ్గుమంటున్నాయి. చేసిన పనులకు టెండర్ వేయకుండా ఉండాలని కాంట్రాక్టర్ల గ్రూప్‌లలో పోస్టులు పెట్టుకుంటున్నారు. అయినా వారి మధ్య అంతర్గత గొడవలు సద్దుమణగడంలేదు. ఈవిషయం బయటకు పొక్కకుండా అధికారులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. పరిస్థితిని చక్కదిద్దడానికి షాడో మేయర్, షాడో కార్పొరేటర్లు కాంట్రాక్టర్ల మధ్య రాజీ కుదుర్చుతున్నట్లు తెలుస్తున్నది.

అధికారులు దృష్టి సారించకపోవడంతోనే ..

ఉన్నతాధికారులు దృష్టి సారించకపోవడం వలనే మున్సిపల్ కార్పొరేషన్‌లో గోల్‌మాల్ పనులు, టెండర్ లేకుండా కోట్లలో పనులు చేపడుతున్నారని, తద్వారా నిధుల దుబారా జరుగుతున్నదని విమర్శలు వస్తున్నాయి. అధికారులు ఎంబీ రికార్డుల్లో లోపాలు ఉన్నట్లు తెలుస్తుంది. ముందుగా చేసిన పనులకు అధికారులు ఎంబీ రికార్డులు ఎలా చేస్తున్నారో తెలియడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు నాసి రకం పనులపై, టెండర్ లేకుండా చేసేపనులపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

బాలాపూర్ వీకర్ సెక్షన్ కాలనీలో నాసిరకంగా చేపడుతున్న సీసీ రోడ్డు

డస్టుతో సీసీ రోడ్లు వేయొద్దు : డీఈ నర్సింహరాజు

డస్టుతో సీసీ రోడ్డు పనులు చేయకూడదు. నాసిరం పనులపై మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామని డీఈ నర్సింహరాజు తెలిపారు. టెండర్ అయిందో లేదో ఆఫీసులో తెలుసుకోవాలి. నిధుల వివరాలు తనకు తెలియదన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని డీఈ పేర్కొన్నారు.

నాసిరకం రోడ్లు వేస్తున్నారు..

బాలాపూర్ వీకర్ సెక్షన్ కాలనీలో ఇసుకతో కాకుండా డస్టుతో సీసీ రోడ్లు వేస్తున్నారు. కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా పనులు చేస్తున్నారు. అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేస్తున్నారు. నాణ్యత లేకుండా రోడ్లు వేస్తే నాలుగు రోజుల్లోనే దెబ్బతినే ప్రమాదం ఉన్నది. ఉన్నతాధికారులు దృష్టి సారించి సదురు కాంట్రాక్టర్ల, అధికారులపై చర్యలు తీసుకోవాలి.

– బొర్ర రవి, ఎమ్మార్పీఎస్ నాయకుడు

భూసార పరీక్షలతో లాభసాటి వ్యవసాయం

శామీర్‌పేట, నవంబర్ 13: రైతులు సాంకేతిక, శాస్త్రీయ పద్ధతిని ఉపయోగించడం, భూసార పరీక్షలతో లాభసాటి వ్యవసాయం చేయవచ్చునని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులుయాదవ్ అన్నారు. ఇక్రిసాట్ ఆధ్వర్యంలో కేశవరం, జగ్గంగూడ, నాగిశెట్టిపల్లి గ్రామాల్లో భూసార పరీక్షలు నిర్వహించి రైతులకు బుధవారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంలో భూమిలో ఉన్న పోషకాలు తెలుసుకుని ఏ ఎరువులు వాడాలి, ఏ పంటలు వేసుకోవాలనే విషయాలు తెలుసుకోవచ్చునన్నారు. రైతులు సాంకేతిక, శాస్త్రీయ పద్ధతులను ఉపయోగిచుకుని లాభసాటి వ్యవసాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇక్రిశాట్ అధికారులు, మాజీ ఎంపీటీసీ హనుమంత్‌రెడ్డి, రైతులు కొమరయ్య, మల్లేశ్, కృష్ణ, బలరామ్‌చారి, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రైతులకు గిట్టుధర అందించేందుకు కృషి చేస్తా..

- హైదరాబాద్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చెకోలేకార్ లక్ష్మీ
- పదవీ బాధ్యతలు స్వీకరించిన నూతన పాలకవర్గం

మార్కెట్ ఉప సంచాలకులు దామోదర్ సమక్షంలో పదవీ బాధ్యతలు చేపడుతున్న చైర్‌పర్సన్ చెకోలేకార్ లక్ష్మీ, వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్, సభ్యులు

మలక్‌పేట, నవంబర్ 13 : హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్‌కమిటీ నూతన పాలకవర్గం బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి, ఉప సంచాలకులు దామోదర్ సమక్షంలో మార్కెట్ కమిటీ నూతన చైర్‌పర్సన్‌గా సలీంనగర్‌కు చెందిన చెకోలేకార్ లక్ష్మీ, వైస్ చైర్మన్‌గా కోట్ల శ్రీనివాస్, డైరెక్టర్లుగా నెలపాటి రామారావు, పన్నాల రాజేందర్‌రెడ్డి, ఎండీ షకీల్, ఎస్‌యూ ప్రత్యూష, బుద్ద సత్యానారాయణ, ఎం.సాయిరాం, మస్రత్ సుల్తానా, పాషం అశోక్‌గౌడ్, కంకాలి శివాజీ, పి.కిషన్ సింగ్, డి.జగదీశ్, ఎం.కృష్ణ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ చెకోలేకార్ లక్ష్మీ మాట్లాడుతూ.. పాలకవర్గ సభ్యులు, అధికారులు సమన్వయంతో రైతులకు గిట్టుబాటు ధర లభించేలా కృషి చేస్తానన్నారు. రైతులకు మేలు చేకూరుస్తూనే వ్యవసాయ మార్కెట్‌కు ఆదాయాన్ని పెంచి అభివృద్ధికి పాటుపడతామన్నారు. వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. మార్కెట్‌లో దళారీ వ్యవస్థకు తావు లేకుండా చైర్‌పర్సన్‌తో కలిసి అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. నూతన పాలకవర్గసభ్యులను అధికారులతోపాటు పలువురు సన్మానించారు. సీఎం రేవంత్‌రెడ్డి, హైదరాబాద్ జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, సీనియర్ నాయకులు మధుయాష్కీగౌడ్‌కు చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ ఉప సంచాలకులు దామోదర్, పీసీసీ ప్రధాన కార్యదర్శి చెకోలేకార్ శ్రీనివాస్, మార్కెట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్బీనగర్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నా..

- ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

నాగోల్‌లో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ అరుణ

మన్సూరాబాద్, నవంబర్ 13: దశల వారీగా అభివృద్ధి పనులు చేపడుతూ ఎల్బీనగర్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చుదిద్దుతున్నానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. నాగోల్ డివిజన్ పరిధి నాగోల్ జంక్షన్ నుంచి బండ్లగూడలోని తాజా టిఫిన్స్ వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు బుధవారం స్థానిక కార్పొరేటర్ చింతల అరుణతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కోట్లాది రూపాయల నిధులతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ప్రజలకు పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈ కనకయ్య, ఏఈ దీపక్, నాయకులు అనంతుల రాజిరెడ్డి, చెరుకు ప్రశాంత్‌గౌడ్, చిరంజీవి, సతీష్‌యాదవ్, చంద్రశేఖర్ ఆజాద్, రంజిత్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కాళోజీకి ఘన నివాళి

కాళోజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మా భూమి సంస్థ సభ్యులు

వనస్థలిపురం, నవంబర్ 13 : ప్రముఖ కవి కాళోజీ నారాయణరావు వర్ధంతిని వనస్థలిపురంలోని వాసవి నిలయంలో బుధవారం మా భూమి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు మాట్లాడుతూ.. పుట్టుక నీది, చావు నీది బతుకంతా తెలంగాణది అన్న నినాదానికి ఆయన జీవితం నిదర్శనమన్నారు. తెలంగాణ కోసం ఆయన చేసిన రచనలు మరువలేనివన్నారు. సంస్థ సభ్యులు నరసింహ ప్రసాద్, ఉదయ్ శంకర్, యానాల నాగిరెడ్డి, రఘునందన్, శరణ్య, పద్మలత తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి

- ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

మన్సూరాబాద్, నవంబర్ 13: ఆర్యవైశ్యుల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తున్నట్లు అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా తెలిపారు. నాగోల్, కోఆపరేటివ్ బ్యాంకు కాలనీలోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ హైదరాబాద్ జిల్లా యువజన విభాగం నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా వాడకట్టి శ్రీకాంత్‌గుప్తా, ప్రధానకార్యదర్శిగా శివకుమార్, కోశాధికారిగా శ్రవణ్‌కుమార్‌కు ఆయన నియామకపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పబ్బ చంద్రశేఖర్, అడిషనల్ జనరల్ సెక్రెటరీ కటకం శ్రీనివాస్, సికింద్రాబాద్ జోన్ కోశాధికారి గుండా శ్రీనివాస్, ముషీరాబాద్ లీగల్ అడ్వైజర్ క్రాంతికుమార్, సభ్యులు రాజు, విజయ్, అఖిల్‌గుప్తా, శ్రీధర్‌గుప్తా, మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడితో చిన్న వయసులోనే మధుమేహం..

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ సందీప్‌రెడ్డి

మన్సూరాబాద్, నవంబర్ 13: జీవనశైలిలో వస్తున్న మార్పులతోపాటు పని ఒత్తిడి కారణంగా యువత మధుమేహం బారినపడుతున్నారని డాక్టర్ జి. సందీప్‌రెడ్డి తెలిపారు. ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఎల్బీనగర్‌లోని కామినేని దవాఖాన ఇందిరా ఆడిటోరియంలో మధుమేహంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సందీప్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంలో సుమారు 50 సంవత్సరాలు పైబడిన వారు మధుమేహం బారినపడేవారన్నారు. నిత్య జీవితంతోపాటు ఉద్యోగంలో ఒత్తిడి వలన 20 నుంచి 30 సంవత్సరాల్లోపు వారికి సైతం మధుమేహం వస్తుందన్నారు. గంటసేపు ఒకే దగ్గర కూర్చుని పని చేయడం, మద్యపానం, ధూమపానం వలన ఎక్కువగా మధుమేహం బారిన పడుతున్నారన్నారు. ఆహారపు అలవాట్లను మార్చుకోవడంతోపాటు యోగా, వ్యాయామం, వాకింగ్ చేయడం ద్వార మధుమేహ వ్యాధి బారినపడకుండా ఉండవచ్చునన్నారు. మధుమేహం పట్ల అవగాహన పెంచుకుని చికిత్స ప్రారంభించినట్లయితే ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తవని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సుధీర్, డాక్టర్ జేసిన్ తదితరులు పాల్గొన్నారు.

గుర్రపు డెక్క వ్యర్థాలను వెంటనే తొలగించాలి

ఉప్పల్, నవంబర్ 13: చెరువులో తొలగించిన గుర్రపు డెక్క వ్యర్థాలను వెంటనే తొలగించాలని నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతిసాయిజెన్ శేఖర్ ఆదేశించారు. నాచారం డివిజన్‌లోని హెచ్‌ఎంటీనగర్ పెద్ద చెరువు పరిసర ప్రాంతాలను బుధవారం ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ చెరువులను సుందరీకరించి, సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.

ఓటరు జాబితాలో సవరణలకు సహకరించాలి

రాజకీయ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి

కందుకూరు, నవంబర్ 13 : ఓటరు జాబితాలో సవరణపై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి సమావేశమయ్యారు. మండల కేంద్రంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్డీఓ ఓటరు జాబితాలో మార్పులుచేర్పులు, నూతన ఓటర్ల నమోదు వంటి అంశాలను వారికి వివరించారు. ఓటర్ లిస్టులో పొరపాట్లు జరగకుండా స్థాని అధికారులకు సహకరించాలని కోరారు. పొరపాట్లు జరిగినట్లు దృష్టికి వస్తే తనను సంప్రదించాలని సూచించారు. నకిలీ ఓట్లు ఉంటే తొలగిస్తామని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో వివిధ పార్టీల నాయకులు, ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జైత్వారంలో ఉచిత పశువైద్య శిబిరం

రైతుకి ఖనిజాల ద్రావణం అందజేస్తున్న పశువైద్యాధికారి డాక్టర్ శ్రావణ్‌కుమార్

కందుకూరు, నవంబర్ 13 : ఉచిత పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రంగారెడ్డి జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ శ్రావణ్ కుమార్ సూచించారు. బుధవారం మండలంలోని జైత్వారం గ్రామంలో కందుకూరు పశువైద్యాధికారి డాక్టర్ రేవతి ఆధ్వర్యంలో పశువుల్లో గర్భకోశ వ్యాధిపై ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మొత్తం 106 ఆవులు, గేదేలకు చికిత్స అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ.. రైతులు పాడి పశువులకు సోకే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. డాక్టర్ల సలహాలు, సూచనలనలను తీసుకోవాలని పేర్కొన్నారు. గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో కందుకూరు, లేమూరు, రాచులూరు గ్రామాల పశు వైద్య డాక్టర్లు రేవతి, సంధ్యారాణి, షాహిన్‌షైన్, జంగయ్య, వసంత, మాధవి, నరేశ్, అప్సర్, ఆరిఫ్, రమేశ్, మాజీ సర్పంచ్ పర్వతాలు యాదవ్, రైతులు పాల్గొన్నారు.

ఈనెల 15 వరకు ఓపెన్ డిగ్రీ అడ్మిషన్లు

హయత్‌నగర్, నవంబర్ 13 : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో చేరడానికి ఈనెల 15 వరకు అడ్మిషన్లు కోరుతున్నట్లు హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ ప్రసాద్, సహాయ కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ నర్సయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు, ఫీజు తదితర వివరాలను www.braouonline.in వెబ్‌సైట్‌లో చూసుకోవాలని పేర్కొన్నారు. నేషనల్ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా ఇంటర్ పూర్తి చేసినవారు, రెగ్యూలర్, ఓపెన్ ఇంటర్ పాసైన వారు, పాలిటెక్నిక్, రెండేళ్ల ఐటీఐ పాసైన విద్యార్థులు నేరుగా డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్ పొందవచ్చని సూచించారు. హయత్‌నగర్ పరిసర ప్రాంతాల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థులు కోర్సు ఫీజును ఈనెల 15 వరకు ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7382929771 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఎంపీఈడీ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 13: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంపీఈడీ పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీఈడీ మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును ఈనెల 18వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 20వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్టు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

సర్వే పరిశీలన

కాప్రా, నవంబర్ 13: రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ,కుల సర్వేను జీహెచ్‌ఎంసీ ఉన్నతస్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. ఇందులో భాగంగా జీహెచ్‌ఎంసీ అడిషనల్ కమిషనర్, నోడల్ అధికారి ఎస్.సరోజ బుధవారం కాప్రా సర్కిల్ ఏఎస్‌రావునగర్ డివిజన్ అనుపురం పరిధిలోని శ్రీలక్ష్మీ రెసిడెన్సీలో జరుగుతున్న సమగ్ర సర్వేను పరిశీలించారు.

సర్వేలో ఎన్యూమరేటర్ల తడబాటు?

- 8 పేజీలతో కుస్తీ
- పలు ప్రశ్నలపై పెదవి విరుస్తున్న ప్రజలు
- 6,7, ప్రశ్నలపై సమాధానం చెప్పేందుకు అనాసక్తి

అగర్‌మియగూడలో సర్వే వివరాలను తెలుసుకుంటున్న సబితాఇంద్రారెడ్డి

కందుకూరు, నవంబర్ 13 : మీరు భూమి కలిగి ఉన్నారా.. ధరణి పాస్‌బుక్ ఉంటే నంబర్ ఇవ్వండి..? మీరు ప్రస్తుతం ఏం పని చేస్తున్నారు? కుల వృత్తి?. గత ఐదు సంవత్సరాలు మీరు ఏమైనా రుణాలు తీసుకున్నారా..?, తీసుకుంటే ఏ అవసరం నిమిత్తం రుణం తీసుకున్నారు? స్థిరాస్తి, చరాస్తి వివరాలు(వాహనాలతో సహా) చెప్పండి. ఇదీ గ్రామాల్లో నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేలో ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేటర్ల ప్రజలను అడుగుతున్న ప్రశ్నలు. సర్వేను పరిశీలించగా 8 పేజీల ఫార్మాట్‌తో వెళ్లిన ఎన్యూమరేటర్లను ఇన్ని వివరాలు ఎందుకు సార్ ? ఏం చేస్తారు? అంటూ ప్రజలు భయపడుతూ ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం చేయమని చెప్పింది.. చేస్తున్నామని కొందరు, నిజమైన పేదలకు న్యాయం చేయడానికి ఉపయోగపడుతుందని తడబడుతూ ప్రజలకు వివరించడం కనిపిస్తున్నది.

ఒక ఫారం నింపేందుకు గంట సమయం..

సమగ్ర కుటుంబ సర్వేలో ఒక్క ఫారం నింపడానికి గంటకుపైగా సమయం పడుతున్నది. ప్రతి ప్రశ్నను ఇంటి యజమానిని అడగాల్సిందేనని ఎన్యూమరేటర్లు పేర్కొంటున్నారు. సర్వేలో రిజర్వేషన్, వలసలు, స్థిరాస్తి, చరాస్తిల వివరాలు, నివాస గృహ విస్తీర్ణం, గదుల సంఖ్యపై ప్రశ్నిస్తుండటంతో ప్రజలు పెదవి విరుస్తున్నారు.

సర్వేను పరిశీలించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

కుటుంబ సర్వేను బుధవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పరిశీలించారు. మండలంలోని అగర్‌మియగూడలో సర్వే నిర్వహిస్తున్న ఇండ్లకు నేరుగా వెళ్లి ఎన్యూమరేటర్లను అడిగి వివరాలను తెలుసుకున్నారు. ప్రజలకు అర్థమయ్యేలా ప్రశ్నలు అడిగి తెలుసుకోవాలని వారి సూచించారు. అనవసరపు ఒత్తిడి పెంచి వివరాలను రాబట్టేందుకు ప్రయత్నించవద్దన్నారు. సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. ఎమ్మెలల్యే వెంట బీఆర్‌ఎస్ నాయకులు గంగాపురం లక్ష్మీనర్సింహారెడ్డి, సురుసాని సురేందర్‌రెడ్డి, మన్నే జయేందర్ ముదిరాజ్, కాకి దశరథ ముదిరాజ్, ఈర్లపల్లి భూపాల్‌రెడ్డి, వడ్డేపల్లి భూపాల్‌రెడ్డి, చంద్రశేఖర్; ర్యాపాకు ప్రభాకర్‌రెడ్డి, మేఘనాథ్‌రెడ్డి, గోపిరెడ్డి మేఘనాథ్‌రెడ్డి, తాళ్ల కార్తిక్, దీక్షిత్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, సంజీవరెడ్డి, ఆనంద్, సుదర్శన్ రెడ్డి తదిరులు ఉన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

ఉప్పల్, నవంబర్ 13 : రామంతాపూర్‌లోని రామ్‌శంకర్‌నగర్‌లో వరదనీటి కాలువ నిర్మాణ పనులను బుధవారం కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావు పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో కలిసి పనులను పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనుల్లో జాప్యం లేకుండా, నాణ్యతగా పనులు పూర్తిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్వేత, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేందర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఎంబీఏ(టీఎం, ఈవినింగ్) ప్రవేశాల గడువు పొడిగింపు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 13: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్), ఎంబీఏ (ఈవినింగ్) కోర్సుల్లో ప్రవేశాలకు గడువును పొడిగించినట్టు ఓయూ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఐ.పాండురంగారెడ్డి తెలిపారు. ఓయూ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం సెమిస్టర్ విధానంలో అందజేసే ఈ కోర్సుల్లో చేరేందుకు ప్రవేశ పరీక్షకు హాజరవ్వాల్సి ఉంటుందని, పరీక్షకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు చెప్పారు. తమ వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాలను డౌన్‌లోడ్ చేసుకొని, పూర్తిగా నింపి, రూ.500 అపరాధ రుసుముతో సహా నియమిత రుసుమును ఈనెల 22వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. పరీక్షను ఈ నెల 24వ తేదీన నిర్వహిస్తామని తెలిపారు. పైరెండు కోర్సులూ ఈవినింగ్ కోర్సులేనని చెప్పారు. ఈ కోర్సుల వ్యవధి రెండేళ్లని పేర్కొన్నారు. టీఎస్ ఐసెట్–2024లో అర్హత సాధించినవారు పరీక్ష రాయాల్సిన అవసరం లేదని, వారు దరఖాస్తు సమర్పించి, నేరుగా కౌన్సిలింగ్‌కు హాజరుకావచ్చని వివరించారు. ఈ రెండు కోర్సులకూ డిగ్రీ పూర్తి చేసి రెండేళ్లు ఎగ్జిక్యూటివ్ కేడర్‌లో విధులు నిర్వర్తించిన అనుభవం ఉండడం తప్పనిసరి అని చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సైదాబాద్, నబంబర్ 13 : ఆస్మాన్‌ఘడ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతు పనుల కారణంగా గురువారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ కాలడేరా, 11కేవీ మిల్క్ బూత్, 11 కేవీ లక్ష్మీనగర్ కాలనీ ఫీడర్ల పరిధిలో ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, 11కేవీ చాదర్‌ఘాట్, 11కేవీ గడ్డిఅన్నారం ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయా ఫీడర్ల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

లెనిన్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో..

బడంగ్‌పేట : లెనిన్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వెంకటయ్య తెలిపారు. గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సీఎంఆర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో రామిడి హిల్స్, విశాఖనగర్, బీఆర్‌ఆర్ కాలనీ, సీఎంఆర్ కాలనీ, రాజీవ్ గృహకల్ప, సీవైఆర్ కాలనీ, మారకుతీనగర్, చంద్రవీహార్, వసంత విహార్ కాలనీల్లో, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అయోధ్యనగర్, ఎస్‌ఎల్‌ఎన్‌ఎస్ కాలనీ, జనప్రియ మహనగర్‌లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

'దళితుల సమస్యలపై ప్రభుత్వాల నిర్లక్ష్యం'

నినదిస్తున్న నాయకులు

బడంగ్‌పేట, నవంబర్ 13 : దళితుల సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజ్ రవీంద్ర చారి ఆరోపించారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఇంద్రానగర్‌లో దళిత హక్కుల పోరాట సమితి బాలాపూర్ మండలాధ్యక్షుడు రామిస్వామి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్ర చారి మాట్లాడుతూ.. దళితులకు ఇండ్ల స్థలాలతోపాటు భూమి పంపిణీ చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో దళితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలేదన్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు కావస్తున్నా దళితులపై వివక్ష పోలేదని, నేటికీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నారన్నారు. ప్రభుత్వ పథకాలు దళితులకు అందని ద్రాక్షగానే మిగిలిపోతున్నాయని, పోరాటాలతోనే హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఎస్సీ కార్పొరేషన్ నుంచి రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో త్వరలో జరగనున్న దళిత హక్కుల జాతీయ మహాసభను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో దళిత హక్కుల పోరాట సమితి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు అంజనేయులు, సీపీఐ మండల కార్యదర్శి ముకుందం, చంద్రశేఖర్‌రెడ్డి, శివ నాయక్, యాదమ్మ, వీరస్వామి, రవి, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు బ్రహ్మకుమారీస్ 'ఇంద్రప్రస్త' ప్రారంభం

సైదాబాద్, నబంబర్ 13 : మలక్‌పేటలోని బ్రహ్మకుమారీస్ ఇంద్రప్రస్త విస్తరణ భవనాన్ని గురువారం ఉదయం ప్రారంభించనున్నట్లు మలక్‌పేట బ్రహ్మకుమారీస్ ఇన్‌చార్జి డాక్టర్ బీకే ఉషారాణి ఒక ప్రకటనలో తెలిపారు. భవన ప్రారంభోత్సవానికి మౌంట్‌అబూ బ్రహ్మకుమారీ బీకే ఆశా దీదీ, శాంతి సరోవర్ సబ్‌జోన్ ఇన్‌చార్జి బీకే కులదీప్ దీదీ, రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సికింద్రాబాద్ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, జస్టిస్ ఈశ్వరయ్య, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డిరంగారెడ్డి, అహ్మద్ బలాల, సుధీర్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు.